క్లుప్తంగా

పాఠశాలల తనిఖీ

దొనకొండ: మండలంలోని ఇండ్లచెరువు ఎస్సీ, జనరల్, కేజీబీవీ పాఠశాలలను మండల విద్యాధికారి ఎస్.సాంబశివరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుకింగ్ నిర్వాహకులకు సూచనలు, సలహాలందించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న గోరుముద్దను మెనూ ప్రకారం తయారు చేయాలన్నారు. ఆరోపణలు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల కోసం మెడికల్ కిట్లు

ముండ్లమూరు: ఉపాధి కూలీలకు మెరుగైన వైద్య చికిత్స అందించడం కోసం ప్రతి పంచాయతీకి మెడికల్ కిట్లు అందజేస్తున్నట్లు ఎంపీడీఓ కుసుమకుమారి తెలిపారు. స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయంలో బుధవారం క్షేత్ర సహాయకులకు మెడికల్ కిట్లు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ కూలీలకు పనుల వద్ద ఎలాంటి చిన్న గాయమైనా వెంటనే ప్రథమ చికిత్స చేయాలన్నారు. ఏపీఓ చినకొండయ్య, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

11న జాతీయ లోక్‌అదాలత్

మార్కాపురం: స్థానిక కోర్టు ప్రాంగణంలో ఈ నెల 11న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ఆరో అదనపు జడ్జి టి.రాజావెంకటాద్రి తెలిపారు. రాజీ పడదగిన క్రిమినల్, సివిల్, బ్యాంక్ చెక్, భరణం, ఫ్యామిలీ, మోటార్ యాక్సిడెంట్ కేసులు ఎటువంటి ఖర్చు లేకుండా పరిష్కరించుకోవచ్చన్నారు. ఎక్కువ కేసుల పరిష్కారానికి న్యాయవాదులు చొరవ చూపాలన్నారు. డబ్బుతో పాటు సమయం కూడా ఆదా అవుతుందని చెప్పారు.

అధికారులు నిర్లక్ష్యం వీడాలి

గిద్దలూరు రూరల్: నగర పంచాయతీ అధికారులు ప్రజల సమస్యలపై నిర్లక్ష్యం వీడాలని వినియోగదారుల సంఘం నాయకులు వీరారెడ్డి, వెంకటేశ్వరరావులు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. పట్టణంలోని ప్రజలు పలు వీధిలైట్లు, నీటి సమస్య, రోడ్డు వంటి పలు సమస్యలపై ఫిర్యాదు చేస్తుంటే అధికారులు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడమే కాకుండా సమస్యలను పరిష్కరిండంలేదని వారు విచారం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.

నంద్యాల వెళ్లి పింఛన్ అందజేత



పింఛన్ అందజేస్తున్న వలంటీర్

గిద్దలూరు రూరల్: మండలంలోని వెల్లుపల్లె సచివాలయం పరిధి జయరాంపురం గ్రామానికి చెందిన మోడిరంగస్వామి అనే వికలాంగుడు అనారోగ్యానికి గురై నంద్యాలలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ జరుబుల రమణనాయక్ నంద్యాలలోని ఓ ప్రైవేటు వైద్యశాల ఐసీయూలో చికిత్స పొందుతున్న రంగస్వామిని వెతుక్కుంటూ వెళ్లి మరీ బుధవారం పింఛన్ అందజేశాడు. రంగస్వామితో పాటు అతడి బంధువులు వలంటరీ సేవలను కొనియాడారు.

పింఛన్ల పంపిణీ 90 శాతం పూర్తి

పుల్లలచెరువు: వైఎస్సార్ పింఛను కానుక పంపిణీ తొలి రోజు 90 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీఓ రాజ్యలక్ష్మి తెలిపారు. మండలంలోని 18 సచివాలయాల పరిధిలో పింఛన్ల పంపిణీని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.



పుల్లలచెరువులో పింఛను పంపిణీ చేస్తున్న వలంటీర్

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

- గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు
- కొత్తూరులో సబ్‌స్టేషన్ ప్రారంభం



సబ్‌స్టేషన్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అన్నా

అర్ధవీడు (కంభం) : రైతులు, ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు అన్నారు. మండలంలోని కొత్తూరులో రూ.2 కోట్లతో నూతనంగా నిర్మించిన 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు శ్రేయస్సే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడం కోసం అవసరమైన చోట్ల సబ్‌స్టేషన్‌లు నిర్మించడం, ఇతర మౌలిక వసతులు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 18 సబ్ స్టేషన్‌లు నిర్మిస్తుండగా అర్ధవీడు మండలంలోని కొత్తూరు సబ్‌స్టేషన్ అన్నింటి కంటే త్వరగా నిర్మించడం సంతోషించదగ్గ విషయమన్నారు. సబ్‌స్టేషన్‌ను మంజూరు చేసిన నాటి విద్యుత్ శాఖ మంత్రిగా ఉన్న బాలినేని శ్రీనివాసరెడ్డికి ఎమ్మెల్యే అన్నా కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో ప్రస్తుతం 8 సబ్‌స్టేషన్‌లు ఉన్నాయని, గతంలో రైతులు, ప్రజలకు విద్యుత్ సమస్యలు ఉండేవని, నూతన సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తి చేసుకోవడంతో రైతులు, ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందుబాటులో ఉంటుందన్నారు. సబ్‌స్టేషన్‌లో ఉద్యోగాలు పొందేందుకు గ్రామాల్లో నాయకులు బేరసారాలు చేసుకుంటున్నట్లు ఓ దినపత్రికలో వచ్చిన వార్తల్లో నిజం లేదని, అది పూర్తిగా అవాస్తవమని, అటువంటివి తాను ఎన్నడూ ప్రోత్సహించనని ఎమ్మెల్యే అన్నా స్పష్టం చేశారు. ఎస్ఈ సత్యనారాయణ, కన్‌స్ట్రక్షన్ డీఈ వెంకటేశ్వర్‌రెడ్డి, ఏడీ బాల అంకయ్య, ఎంపీపీ వెంకట్రావు, జెడ్పీటీసీ చెన్ను విజయ, ఏఈ నారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ రవికుమార్ యాదవ్ పాల్గొన్నారు.

వినియోగంలోకి పాత పోలీసుస్టేషన్

అర్ధవీడు: నిరుపయోగంగా ఉన్న పాత పోలీసుస్టేషన్‌కు మరమ్మతులు చేయించగా బుధవారం గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు, మార్కాపురం డీఎస్పీ ఎం.కిశోర్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. బ్రిటీష్ కాలంలో నిర్మించిన పోలీసుస్టేషన్ భవనం నూతన పోలీసుస్టేషన్ నిర్మాణంతో నిరుపయోగంగా ఉంది. కొంతకాలం పంచాయతీ కార్యాలయంగా వినియోగించుకోగా నూతన సచివాలయాల నిర్మాణంతో తిరిగి నిరుపయోగంగా మారిపోయింది. ఈ నేపథ్యంలో ఆ భవనాన్ని పోలీసులు మరమ్మతులు చేయించి ఉన్నతాధికారులు, ఇతర సమావేశాలకు వినియోగించుకునేందుకు సిద్ధం చేసుకున్నారు. నిరుపయోగంగా ఉన్న భవనాన్ని తిరిగి వినియోగంలోకి తీసుకొని రావడం హర్షణీయమని ఎమ్మెల్యే అన్నారు. కంభం సీఐ ఎం.రాజేష్, ఎస్ఐ వెంకటేశ్వరనాయక్, ఎంపీపీ వెంకట్రావు, జెడ్పీటీసీ చెన్ను విజయ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెల్లో అందుబాటులో పశువైద్యసేవలు



పశుసంచార వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అన్నా

కంభం: డాక్టర్ వైఎస్సార్ పశు ఆరోగ్య సేవ మొబైల్ వాహనం ద్వారా రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతోందని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు అన్నారు. కంభం పశువైద్యశాలకు నూతనంగా మంజూరైన పశుసంచార వాహనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మారుమూల ప్రాంతాలకు పశుసేవలు అందని వారు 1962 నంబర్‌కు కాల్ చేస్తే వాహనం అక్కడి వెళ్లి సేవలందిస్తుందన్నారు. అవసరమైతే వాహనంలో పశువును కంభం ఏరియా వైద్యశాలకు తీసుకొచ్చి ఒకటి రెండు రోజులు ఉంచుకొని చికిత్స అందించే అవకాశం ఉందన్నారు. పశుపోషకలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వాహనంలో డాక్టర్, కాంపౌండర్, పైలట్ అందుబాటులో ఉంటారని ఎమ్మెల్యే అన్నా తెలిపారు. పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకట సుబ్బయ్య, కంభం ఏడీ బాలు నాయక్, బేస్తవారిపేట ఏడీ వేణుగోపాల్, వెటర్నరీ వైద్యులు డాక్టర్ శివారెడ్డి, బాలచంద్రుడు, హర్షవర్ధన్, శ్రీధర్, జెడ్పీటీసీ సభ్యురాలు కొత్తపల్లి జ్యోతి, ఏఎంసీ మాజీ చైర్మన్ నెమలిదిన్నె చెన్నారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సయ్యద్ జాకీర్ హుస్సేన్, చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, గొంగటి చెన్నారెడ్డి, సబ్బసాని సాంబశివారెడ్డి, సయ్యద్ ఖాసిం, నరాల ఈశ్వరరెడ్డి, సయ్యద్ సలీం, ఆనంద్, రఫీ, సూర్యప్రకాష్, పాల్గొన్నారు.

పంటకు సోకిన పురుగును గుర్తించాలి



మిర్చి పొలాన్ని పరిశీలిస్తున్న శ్వేత

రాచర్ల: మిరప పంటకు ఆశించిన పురుగును రైతులు సకాలంలో గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని ఉద్యాన శాఖాధికారి శ్వేత అన్నారు. మండలంలోని ఆరవీటికోట, ఆకవీడు, చోళ్లవీడు, చినగానిపల్లె, అనుములపల్లె గ్రామాల్లో రైతులు సాగు చేసిన మిర్చి పొలాలను బుధవారం ఆమె పరిశీలించారు. మిర్చి పంటలోని పండు మిర్చి మీద నల్లటి మచ్చలు ఏర్పడి కుళ్లిపోవడం రైతులు గమనించాలన్నారు. నల్లటి మచ్చలు నివారణకు లీటరు నీటికి ప్రొపికొనజోల్ ఒక మిల్లీ లేదా డైఫెన్‌కినజోల్ 0.5 మిల్లీ లేదా అజాక్సీస్ట్రోబిన్ పూత సమయంలో కాయలు పండుబారే సమయంలో పిచికారీ చేయాలని సూచించారు. కిలో విత్తనానికి 3 గ్రాముల కాప్టాన్ లేదా 3 గ్రాముల మాంకోజెబ్‌తో విత్తనశుద్ధి చేయాలన్నారు. కాయకుళ్లు తెగులు సోకిన మొక్కల నుంచి విత్తనం సేకరించరాదన్నారు. అనుములపల్లె రైతు భరోసా కేంద్రాల అగ్రికల్చర్ అసిస్టెంట్ రమణ, లలిత పాల్గొన్నారు.

ఉపాధి పనులు వేగవంతం చేయాలి



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ కుసుమకుమారి

ముండ్లమూరు: ఉపాధి పనులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ కె. కుసుమకుమారి సూచించారు. మండలంలోని ఉల్లగల్లు, పసుపుగల్లు, వేంపాడు, శంకరాపురం గ్రామాల్లో బుధవారం ఉపాధి పనులను ఆమె పరిశీలించారు. కూలీల మస్టర్లను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. నిబంధనల మేరకు పనులు చేస్తే రోజువారీ కూలీ 257 రూపాయలు పడుతుందన్నారు. సిబ్బంది కూలీలకు కొలతలు చూపించి ఆ మేరకు పనులు చేయించాలన్నారు. అనంతరం ఆమె పోలవరం, శంకరాపురం సచివాలయాలను సందర్శించి సిబ్బంది హాజరును పరిశీలించారు. స్పందన ద్వారా వచ్చిన అర్జీలను ఆన్‌లైన్ చేసి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఏపీఓ చినకొండయ్య, సాంకేతిక సహాయకులు సుధాకర్, సర్పంచ్ నంబూరి లీలమ్మ, కార్యదర్శి మౌలాలీ ఉన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం

మార్కాపురం టౌన్: బడ్జెట్‌లో ఏపీకి బీజేపీ ప్రభుత్వం అన్యాయం చేసిందని ఆప్ జిల్లా కన్వీనర్ వి.సుదర్శన్ అన్నారు. ప్రత్యేక హోదా విభజన చట్టం హామీలను కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని బుధవారం ఆయన ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంపై బీజేపీ ప్రభుత్వం కక్ష సాధిస్తోందని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయింపు, రైల్వే జోనులు వంటి ప్రధాన అంశాలకు చోటు లేకపోవడం విచారకరమన్నారు.

వేరుశనగలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

తాళ్లూరు: వేరుశనగలో యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారి ప్రసాదరావు కోరారు. శివరామపురంలో వేరుశనగ పంటను ఆయన బుధవారం పరిశీలించారు. రెక్కల పురుగులు భూమి నుంచి బయటకు రావటం ప్రారంభమై అంచెలంచెలుగా 30 నుంచి 45 రోజుల పాటు కనిపిస్తాయని చెప్పారు. నివారణ చర్యలు వివరించారు. వీఏఏ రాజశేఖర్ పాల్గొన్నారు.

నేడు పెద్దదోర్నాలలో గడప గడపకు మన ప్రభుత్వం

పెద్దదోర్నాల: రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ బుధవారం పెద్దదోర్నాలలో పర్యటించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంటా రమణారెడ్డి తెలిపారు. సాయంత్రం 4 గంటలకు మండల కేంద్రంలోని ఒకటో సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు

మార్కాపురం టౌన్: పట్టణంలోని ఓ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్న విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ శశికుమార్ తెలిపారు. పుల్లలచెరువుకు చెందిన వెంకటరెడ్డి కుమార్తె గత నెల 31న ఇంటి నుంచి మార్కాపురం వచ్చి కళాశాలకు వెళ్లకుండా ఇంటికి రాకుండా ఉండటంతో బంధుమిత్రుల ఇళ్లల్లో వెతికినా కనిపించలేదని వెంకటరెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈఓ సుబ్బయ్య

తాళ్లూరు: తూర్పుగంగవరం మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖాధికారి జి.సుబ్బయ్య బుధవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. విద్యార్థులకు రోజూ ప్రత్యేక మెనూ వడ్డిస్తున్నారా.. అని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయుడు కోటిరెడ్డి, ఉపాధ్యాయులు కె.లక్ష్మీకాంత, సీఆర్‌పీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైభవంగా నరసింహస్వామి పుట్ట తిరునాళ్ల



స్వామివారి సన్నిధిలో పూజలు చేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

పెద్దారవీడు: మండలంలోని తోకపల్లె గ్రామంలో సద్గురు యోగానంద నరసింహస్వామి 67వ పుట్ట తిరునాళ్ల మహోత్సవం బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. అర్చకులు భవానిప్రసాద్ ఆధ్వర్యంలో తెల్లవారుజామున స్వామివారికి పంచామృతాభిషేకం చేసి, పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి చిత్రపటాన్ని గ్రామంలో మేళతాళాలలతో ఊరేగించారు. 41 రోజులు దీక్ష ఆచరించిన స్వాములు ఇరుముడితో ఊరేగింపుగా బయలుదేరి ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయం ప్రాంగణంలో హోమంలో పాల్గొని దీక్ష విరమించారు. మహిళా భక్తులు పుట్టను పసుపు, కుంకుమ, పూలతో అలంకరించి పూజలు చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుండి భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పూజల్లో పాల్గొన్న మంత్రి సురేష్

రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ స్వామి వారి తిరునాళ్లలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మంత్రిని ఘనంగా సన్మానించారు. మధ్యాహ్నం దాతల సాకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం భారత కోలాటం, రాత్రికి భక్తప్రహ్లాద నాటకం ప్రదర్శించారు. మంత్రి వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి, ఎంపీపీ బెజవాడ పెద్దగురవయ్య, సర్పంచ్ జిల్లెల నాగమల్లేశ్వరి, నాయకులు రామిరెడ్డి, నరాల రామచంద్రుడు, సోంటి నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ సీఎంగా జగనన్నను గెలిపిద్దాం..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపిద్దామని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. మార్కాపురం మండలం పెద్ద యాచవరం ఎస్సీ పాలెంలో ఏటా జనవరి నెలాఖరున బూదాలవారి కుటుంబీకులు ఏర్పాటు చేసిన వేడుకల విద్యుత్ ప్రభపై మంగళవారం రాత్రి ఆయన మాట్లాడారు. టీడీపీ హయాంలో లేని సంక్షేమ పథకాలన్నీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలను దృష్టిలో పెట్టుకుని అమలు చేయడంతో పేద కుటుంబాల్లో సంతోషం కనిపిస్తోందన్నారు. కులాలు, మతాలు, పార్టీలు, వర్గాలు తేడా లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతోందన్నారు. రైతు భరోసా, అమ్మ ఒడి, ఆసరా, చేదోడు వంటి పథకాలు అమలు చేస్తూ పేద ప్రజల గుండెల్లో జగనన్న చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. సీఎం సహకారంతో మార్కాపురం నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయన్నారు. మెడికల్ కాలేజీ నిర్మాణం మార్కాపురానికి వరంగా మారుతుందని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి స్పష్టం చేశారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ బాపన్‌రెడ్డి, ఎంపీపీ అరుణచెంచిరెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్ సవ్వాని వెంకటేశ్వర్లు, బెంజిమెన్, ఏసురత్నం, నారాయణ, దశరథ్ పాల్గొన్నారు.

మీడియా కవరేజ్ కోసమే లోకేష్ యువగళం



గృహసారథులకు కిట్‌లు అందిస్తున్న ఎమ్మెల్యే కేపీ

తర్లుపాడు: మీడియా కవరేజ్ కోసమే యువగళం పేరుతో నారా లోకేష్ పాదయాత్ర చేస్తున్నారని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి విమర్శించారు. బుధవారం మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయ ప్రాంగణంలో జగనన్న గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లోకేష్ పాదయాత్ర ఎందుకు చేస్తున్నారో దాని లక్ష్యమేమిటో స్పష్టత లేదన్నారు. చిత్తశుద్ధి లేని పాదయాత్ర ఐనందునే ప్రజాదరణ లేదన్నారు. ముఖ్యమంత్రి జగన్ సచివాలయ వలంటీర్ల వ్యవస్థకు శ్రీకారం చుట్టి గడప వద్దకే పాలన, పథకాలు తీసుకొచ్చారన్నారు. గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాల సొమ్మును జన్మభూమి కమిటీలు స్వాహా చేశాయన్నారు. మన ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలతో సంబంధం లేకుండా ఇంటి వద్దకే పథకాలు వస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలందరూ వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కోరారు. వలంటీర్ల సేవలను కొనియాడారు. గృహసారథులకు బ్యాడ్జీతో కూడిన కిట్ అందించారు. ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, జెడ్పీటీసీ వెన్నా ఇందిరా హనుమారెడ్డి, పార్టీ మండల ప్రెసిడెంట్ మురారి వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు కాశయ్య, జాన్‌రత్నం, పెద్ద మస్తాన్, కాప్షన్ సభ్యులు అక్బర్ అలీ, రామాంజనేయరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలపై విద్యార్థులకు అవగాహన

ముండ్లమూరు: స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సేవలపై బుధవారం అవగాహన కల్పించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సేవలు, పోస్టల్ శాఖ అందిస్తున్న సేవలు, బ్యాంకింగ్ సేవలు, పశువైద్య సేవలులపై విద్యార్థులకు ఆయా శాఖల అధికారులు, సిబ్బంది అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో వైద్యాధికారి జాస్మిన్, ఉపాధ్యాయుడు రాఘవ పాల్గొన్నారు.

సర్కిల్ కార్యాలయ నిర్మాణానికి భూమిపూజ



ఎత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అన్నా

కంభం: కంభంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న పోలీసు సర్కిల్ కార్యాలయానికి బుధవారం గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు, మార్కాపురం డీఎస్పీ ఎం.కిశోర్‌లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు చేసి పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కంభం నూతనంగా సర్కిల్ ఏర్పడిన నేపథ్యంలో పట్టణంలో నిరుపయోగంగా ఉన్న పాత పోలీసుస్టేషన్ స్థానంలో నూతన సర్కిల్ భవనం నిర్మించుకోవడం శుభపరిణామమన్నారు. వ్యాపార కూడలి మధ్య సర్కిల్ కార్యాలయం ఉండటంతో పోలీస్ సేవలు మరింత చేరువయ్యే అవకాశం ఉందన్నారు. కంభం, మార్కాపురం సీఐ ఎం.రాజేష్, భీమానాయక్, కంభం, బేస్తవారిపేట, అర్ధవీడు ఎస్ఐలు నాగమల్లేశ్వరరావు, మాధవరావు, వెంకటేశ్వరనాయక్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక పూజలు



కొబ్బరి కాయలతో స్వామివారి అలంకరణ

మార్కాపురం: భూదేవి శ్రీదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారికి 108 కొబ్బరి బొండాలతో అష్టోత్తర శతకలిశా స్థాపన పూజలు చేశారు. స్వామివారి మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా రాత్రి 7 గంటలకు రథోత్సవం నిర్వహించారు. ఉత్సవానికి ముందు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అధ్యక్ష, కార్యదర్శులు మాలకొండ నరసింహారావు, ఆర్‌కేజే నరసింహం, కోశాధికారి ఉటుకూరి రామకృష్ణ, కమిటీ సభ్యులు ఏరువా దేవిరెడ్డి పాల్గొన్నారు.

నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలి

పొదిలి రూరల్: రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో నీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ పి. శ్రీకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న నీటి వనరులను అంచనా వేసుకుని ముందస్తు యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలన్నారు. గ్రామాల్లో ఉన్న చేతి పంపులు, డీప్‌బోర్లు, ఓవర్ హెడ్ ట్యాంకులు పరిశీలించాలన్నారు. గ్రామాల్లో చేతి పంపులు రిపేరు చేయించాలన్నారు. ఇందుకోసం మోటారు మెకానిక్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శులు టీమ్‌గా ఆయా గ్రామాల సర్పంచ్‌లను సమన్వయం చేసుకుని ఆయా గ్రామాల్లో పర్యటించి సమస్యలు గుర్తించాలన్నారు. ఈ టీమ్ 1,2 తేదీల్లో మూగచింతల, 3,4న కొండాయపాలెం, 6 ఓబులక్కపల్లె, 7న అక్కచెరువు, 8 తుమ్మగుంట, 9 సూదనగుంట, 10 జువ్వలేరు, 13 కొస్టలపల్లి, 14 మల్లవరం, 15,16,17 ఆముదాలపల్లి, 20 అన్నవరం, 22 ఈగలపాడు, 23న కుంచేపల్లి, 24న నందిపాలెం, 28న గొల్లపల్లి, మార్చి 1 పాములపాడు, 2 తలమల్ల, 3న గోగినేనివారిపాలెం, 4న ఉప్పలపాడు, 9,10 ఏలూరు పరిశీలించాలన్నారు. ఈఓఆర్డీ రాజశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

కంభం: అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు మంగళవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. స్థానిక నాయక్ వీధిలో రేషన్ బియ్యం నిల్వ ఉన్నట్లు సమాచారం రావడంతో తనిఖీలు చేసిన రెవెన్యూ అధికారులు 20 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యాన్ని గోడౌన్‌కు తరలిస్తామని రెవెన్యూ అధికారులు తెలిపారు.